
GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

HAPPY Independence DAY
# క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 22-05-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# తమ్మడపల్లిలో వెలిసిన నూతన వెంచర్..

- సరైన అనుమతులు లేకుండానే పనులు ప్రారంభమా..!?
- గ్రామకంఠం భూమిని కబ్జా చేశారన్న ఆరోపణలు.!?
- వెంచర్ నిర్మాణం అంటూ భారీ చెట్ల నరికివేత, బావుల పూడ్చివేత..!?
- ఇరిగేషన్ కాలువలు కనుమరుగు.. మట్టితో మూసేసే ప్రయత్నం..!?
- పురాతన దేవాలయాల పరిస్థితి ప్రశ్నార్థకం.. ఊరి బురుజు చుట్టూ ఇరకాటం..
- సర్వే నెంబర్ 80పై అనేక అనుమానాలు. విచారణ జరపాలన్న ప్రజలు.!?
- బాలమ్మ, మైసమ్మల గుడి గర్భాలను తొలగిస్తారా.. డెవలప్ చేస్తారా..!?





8లో

# అగ్ని గుండంలా.. 'అంత్య పుష్కరాలు'

- 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- భక్తుల భద్రతలో నిమగ్నమైన సిబ్బందికి తీవ్ర ఎండ ఇబ్బందులు
- మండిపోతున్న ఎండల మధ్య కొనసాగుతున్న పుష్కర సేవలు

3లో





## కన్నులపండుగగా..
# సరస్వతి అంత్య పుష్కరాలు

- తొలి పుష్కర స్నానం చేసిన కంచి పీఠాధిపతి
- త్రివేణి సంగమానికి పోటెత్తిన భక్తజనం
- వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు
- 2,500 మంది పోలీసులతో భారీ బందోబస్తు

క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమ తీరంలో గురువారం సరస్వతీ నది అంత్య పుష్కరాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజునే భక్తులతో పుష్కర ఘాట్లు కిక్కిరిసిపోయాయి. రాష్ట్రం నలుమూలలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి పవిత్ర స్నానాలు ఆచరించారు. పుష్కరాల తొలి రోజైన గురువారం ఉదయం 5:43 గంటలకు శుభ ముహూర్తంలో

3లో



# జీన్స్‌లో అమ్మ "కొంగు" ఎక్కడ దొరుకుతుంది?

**ఆత్మకూరు(ఎం),మే21/క్రైమ్ మిర్రర్:** జీన్స్ లో అమ్మ"కొంగు"ఎక్కడ దొరుకుతుంది? పాఠశాలలో, ఉపాధ్యాయురాలు విద్యార్థులను "అమ్మ కొంగు" పై ఒక వ్యాసం రాయమని అడిగారు.ఒక విద్యార్థి రాసిన విషయం ఎంత హృదయానికి హత్తుకునేలా ఉందంటే,అది మీ మనసును భావోద్వేగాలతో నింపేస్తుంది. గౌరవనీయ ఉపాధ్యాయురాలీకీ అంటూ మొదలిడిన చిన్నారి అభిప్రాయం "అమ్మ కొంగు కేవలం ఒక వస్త్రపు ముక్క మాత్రమే కాదు; అది అమ్మ యొక్క గౌరవం మరియు ఔన్నత్యం.పొయ్యి మీద ఉన్న వేడి పాత్రలను దించడానికి అమ్మ కొంగునే ఉపయోగించేవారు.అది పిల్లల చెమటను, కన్నీళ్లను తుడిచేది; మురికి పట్టిన ముఖాలను, చెవులను, చిట్టి చేతులను శుభ్రం చేసేది.భోజనం చేసిన తర్వాత, అమ్మ కొంగుతో మా ముఖాలను తుడిపించుకోవడంలో ఒక ప్రత్యేకమైన హాయి ఉండేది.మా కళ్ళలో ఏదైనా పడినప్పుడు, అమ్మ కొంగును మెలివేసి, తన ఊపిరితో దాన్ని మెల్లగా వెచ్చబరిచి, కంటిపై ఉంచేది ఎందుకో తెలియదు గానీ,ఆ నొప్పి వెంటనే మాయమైపోయేది.అమ్మ ఒడిలో నిద్రించే పిల్లలకు, ఆమె ఒడి మృదువైన పడకగా, ఆమె కొంగు హాయినిచ్చే దుప్పటిగా మారేది. ఇంట్లోకి ఎవరైనా కొత్తవారు వచ్చినప్పుడు, పిల్లలు భద్రత కోసం అమ్మ కొంగు వెనుక దాక్కునేవారు.పిల్లలకు సిగ్గు అనిపించినప్పుడు, వారు అమ్మ కొంగుతో తమ ముఖాన్ని కప్పుకునేవారు.పిల్లలు బయటకు వెళ్ళినప్పుడు,వారు అమ్మ కొంగును పట్టుకునేవారు. అది వారికి మార్గదర్శిగా, రక్షణ కవచంగా నిలిచేది.పిల్లలు అమ్మ కొంగును పట్టుకుని ఉన్నంత సేపు, ఈ ప్రపంచమంతా తమ చేతిలోనే సురక్షితంగా ఉన్నట్లు వారికి అనిపించేది.చలికాలంలో, చలి నుండి రక్షించడానికి అమ్మ తన కొంగుతో పిల్లలను నలువైపులా చుట్టేసేది.మరియు భారీ వర్షం కురిసినప్పుడు, అదే కొంగు గొడుగులా మారి పిల్లల ముఖాన్ని కప్పేది.చేతులు తుడుచుకోవడానికి అమ్మ కొంగును తువ్వాలులా కూడా ఉపయోగించేవారు.చెట్ల కింద రాలిన పూలను, పండ్లను సేకరించి అందులోనే మోసుకొచ్చేది.కొన్నిసార్లు, ధాన్యాన్ని, నైవేద్యాన్ని లేదా ప్రసాదాన్ని అందులోనే సేకరించేవారు.ఇంటి సామాన్లను దుమ్ము దులపడానికి, శుభ్రం చేయడానికి కూడా దాన్ని ఉపయోగించేవారు.ఏదైనా వస్తువు పోయినప్పుడు, అది త్వరలోనే దొరుకుతుందని నమ్మి అమ్మ తన కొంగుకు ఒక ముడి వేసేది. వింతగా అనిపించినా, అది సాధారణంగా దొరికిపోయేదే.అమ్మ కొంగులోని ఆ ముడి ఒక కదిలే బ్యాంకు లేదా లాకర్ లాంటిది. పిల్లల అదృష్టం బాగుంటే,అందులో దాగి ఉన్న కొన్ని నాణేలు మాయాజాలంలా బయటపడేవి కూడా, అమ్మ చీర కొంగు కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదు అది ఒక అద్భుతమైన అనుభూతి, ఒక భావోద్వేగం, ఒక ఆశ్రయం, మరియు ప్రేమతో నిండిన ఒక ప్రపంచం.నేటి తరం ఆ కొంగులోని వెచ్చదనాన్ని,దాని లోతైన అర్థాన్ని బహుశా ఎప్పటికీ పూర్తిగా అర్థం చేసుకోలేకపోవచ్చు.ఇప్పుడు, అమ్మలు జీన్స్ ధరిస్తున్న ఈ రోజుల్లో...మరి ఆ "కొంగు" ఎక్కడి నుండి వస్తుంది? ప్రేమను, వెచ్చదనాన్ని,త్యాగాన్ని మరియు బాల్యపు లెక్కలేనన్ని మధుర స్మృతులను తనలో మోసుకున్న ప్రతి అమ్మ చీర కొంగుకు ఈ నివాళి."అంటూ వ్రాసిన ఆ చిన్నారి విజ్ఞతను తెలియపరుస్తుందీ.

# తమ్మడపల్లిలో వెలిసిన నూతన వెంచర్..

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమాలు మితిమీరుతున్నాయి.? ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా, నిబంధనలను బేఖాతరు చేస్తూ, వెంచర్ పనులు ప్రారంభించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.? ప్రభుత్వ భూములను, ప్రజా ప్రయోజనార్థం ఉన్న వనరులను సైతం, వదలకుండా కబ్జా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.? తమ్మడపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 80లో కొత్తగా ఒక భారీ వెంచర్ వెలిసింది. నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిని నాలా కన్వర్షన్ పూర్తి చేసి, డీటీసీపీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన తర్వాతే పనులు ప్రారంభించాలి. కానీ ఇక్కడ ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే, గుట్టుచప్పుడు కాకుండా పనులు కానిచ్చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.! అన్నింటికంటే ముఖ్యంగా, ఇందులో విలువైన గ్రామకంఠం భూమిని సైతం, కలిపేసుకొని కబ్జాకు పాల్పడ్డారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.!వెంచర్ డెవలప్‌మెంట్ పేరుతో ఇక్కడి ప్రకృతి సంపదను దారుణంగా ధ్వంసం చేస్తున్నారు. భారీ వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికివేయడమే కాకుండా, రైతులకు సాగునీరు, గ్రామానికి జలవనరులుగా ఉన్న, చిన్న చిన్న కాలువలను మట్టితో కప్పివేస్తూ, వాటి ఆనవాళ్లు లేకుండా చేసే ప్రయత్నం జరుగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. భూగర్భ జలాలకు ఆధారమైన పురాతన బావులను సైతం, మట్టితో పూడ్చేస్తూ ప్రకృతిని నట్టేట ముంచుతున్నారు. ఈ వెంచర్ పుణ్యమా అని గ్రామ చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిన కట్టడాలు, ప్రజల సెంటిమెంట్లు కూడా ప్రమాదంలో పడ్డాయి. వెంచర్ సరిహద్దుల్లో ఉన్న పురాతన బురుజు చుట్టూ కనీసం తిరగడానికి వీల్లేకుండా ప్రికాషన్ వాల్స్ నిర్మించి, బురుజును ఇరకాటంలో పడేశారు. మరింత ఘోరమైన విషయమేమిటంటే... స్థానిక ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచే బాలమ్మ, మైసమ్మ దేవతల గుడులు, ఇప్పుడు ఈ వెంచర్ మధ్యలోకి వచ్చాయి. లాభాల కక్కుర్తితో ఈ గుడి గర్భాలను, దేవతల ఆనవాళ్లను పూర్తిగా తొలగిస్తారా? లేక అలాగే ఉంచుతారా? అనే భయాందోళనలు భక్తులలో వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ గుడులను ధ్వంసం చేస్తే ఊరుకునేది లేదని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారంపై తమ్మడపల్లి గ్రామప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెంబర్ 80 లో జరుగుతున్న భూసేకరణ, వెంచర్ విస్తీర్ణంపై రెవెన్యూ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి, పరిశీలన జరిపి సర్వే నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి కాలువలు పూడ్చుతున్న వారిపై ఇరిగేషన్ శాఖ, చెట్లను నరుకుతున్న వారిపై అటవీ శాఖ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు అంటున్నారు.. గ్రామ సంపదను, దేవుడి ఆనవాళ్లను కాపాడటంలో జిల్లా కలెక్టర్, స్థానిక అధికారులు వెంటనే స్పందించి, సమగ్ర విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు..





## గద్వాల విజయలక్ష్మీని మర్యాద పూర్వకంగా కలిసిన బండ్రు శోభారాణి

**ఆత్మకూరు(ఎం),మే21/క్రైమ్ మిర్రర్:** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా నూతనంగా నియమితులైన గద్వాల్ విజయలక్ష్మిని గురువారం రోజు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్పర్సన్ బండ్రు శోభారాణి భాస్కర్.

# విశ్రాంత ఐపీఎస్ సతీమణి హత్య కేసులో ట్విస్ట్

**చోరీ సొత్తు పంచుకుని సరిహద్దు దాటిన ముగ్గురు**

**నేపాలీ గ్యాంగ్ సభ్యుడి అరెస్ట్**

బంజారాహిల్స్,మే 21: జూబ్లీహిల్స్‌లో విశ్రాంత ఐపీఎస్ సతీమణి భార్య తనూజ రంజన్ హత్య కేసులో నింది తుల కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. పనిమనిషి కల్పనతో పాటు మరో ముగ్గురు మాత్రమే పాల్గొన్నారని ముందుగా భావించారు. తాజా గా పోలీసుల విచారణలో భాగంగా మొత్తం ఏడుగురు నిందితులు ఉన్నట్లు గుర్తించారు. చోరీ గ్యాంగ్‌లో సభ్యుడైన సునీల్ పర్యార్‌ను గురువారం జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సునీల్ పర్యార్ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మే 8న తనూజ రంజన్ ఇంట్లో చోరీకి పాల్పడిన నేపాలీ గ్యాంగ్‌లో కల్పనతో పాటు సురేష్ షాహీ అలియాస్ సృజన్ షాహీ, గణేష్ బికా, కందాలామా, నేత్ర షాహీ, సునీల్ పర్యార్, గణేష్ షాషీ అనే వ్యక్తులున్నారని తేలింది. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం నేరుగా రైల్లో కాజీపేట వెళ్లి అక్కడనుంచి ముంబయికి చేరుకున్న నేపాలీ గ్యాంగ్ సభ్యులు అక్కడే చోరీ సొత్తును పంచుకున్నట్లు తేలింది. అక్కడినుంచి ఎవరికి వారు వేర్వేరు మార్గాల్లో పారిపోయినట్లు తేలింది. కాగా ముంబయికి చేరుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నాలు చేయగా సునీల్ పర్యార్ మాత్రమే చిక్కాడు. అతడు దిలీప్ బహదూర్ అనే వ్యక్తికి బంగారం విక్రయించినట్లు గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. సునీ ల్ పర్యార్‌ను రిమాండ్‌కు తరలించారు.

**నేపాల్ సరిహద్దులు దాటిన నిందితులు..**

ఇదిలా ఉండగా జూబ్లీహిల్స్‌లో తనూ జ రంజన్‌ను హత్య చేసిన అనంతరం వారిని పట్టుకునేందుకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు ప్రత్యేక బృందాలు అదే రోజున రంగంలోకి దిగాయి. నాలు గు బృందాలు ఉత్తర్‌ప్రదేశ్‌లోని నేపాల్ సరిహద్దులో మోహరించాయి. అయితే నేపాల్‌కు, భారత్‌కు మధ్యన సుమారు 1700 కిలోమీటర్ల మేర సరిహద్దు ఉండడంతో పాటు దాదాపు 400దాకా చెక్‌పోస్ట్‌లు ఉండడంతో నేపాలీ గ్యాంగ్‌లోని ముగ్గురు నిందితులు సరిహద్దులు దాటినట్లు పోలీసులు గుర్తించారు. దౌత్యమార్గంలో నేరస్థులను పట్టుకోవడం ఒక్కటే ప్రస్తుతం పోలీసుల ముందున్న మార్గం గా కనిపిస్తోంది.







# దేశానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలు అజరామరం

- స్వర్గీయ రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి
- వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి

**చౌటుప్పల్,మే 21,క్రైమ్ మిర్రర్:** భారత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలు అజరామరమని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం రాజీవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని రాజీవ్ స్మారక భవనంలో జరిగిన భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 36 వ, వర్ధంతి కార్యమానికి ముఖ్య అతిథిగా ఆకుల ఇంద్రసేనారెడ్డి పాల్గొని స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలలో ఆధునిక భారత దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు టెలికాం, కంప్యూటర్ విప్లవాలకు, స్థానిక సంస్థల బలోపేతానికి ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో స్థిర స్థాయిగా నిలిచిపోతుందన్నారు .21ఏళ్ల వయస్సు నుండి 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కిందని అన్నారు.ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఇంద్రసేనారెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, రాజీవ్ ట్రస్ట్ ఉపాధ్యక్షులు జింద్రు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎంఏ ఖయ్యూం, కార్యదర్శి నల్ల నరసింహ, నాయకులు చింతల సాయిలు, ఆవుల యేసు దాసు, కంచర్ల జంగయ్య, మాదని గోపాల్, బండమీద ఎల్లయ్య, ఎండీ చాంద్ పాషా, ఉదారి యాదయ్య , తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి నియంత్రణకు పోలీసుల ఆకస్మిక తనిఖీలు

- బీజోన్, ఏరియా హాస్పిటల్ పరిసరాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు
- చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్సై జె. శ్రీధర్

**రామకృష్ణాపూర్, మే 21 (క్రైమ్ మిర్రర్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం స్థానిక ఎస్సై జె.శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, యాంటీ నార్కోటిక్స్ వింగ్, నార్కోటిక్ స్నిఫర్ డాగ్ స్క్వాడ్‌తో కలిసి బీజోన్, ఏరియా హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా హోటళ్లు, పాన్‌షాపులు, అనుమానాస్పద ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో పాటు చిన్నారులకు మత్తు కలిగించే చాక్లెట్లు, గుట్కా, సిగరెట్లు వంటి నిషేధిత వస్తువుల విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించారు.ఎవరైనా మత్తు పదార్థాల విక్రయాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై జె.శ్రీధర్ హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు.గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడడమే లక్ష్యంగా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో యాంటీ నార్కోటిక్ వింగ్ సిబ్బంది, రామకృష్ణాపూర్ పోలీసులు పాల్గొన్నారు.



# కన్నులపండుగగా.. 'సరస్వతి అంత్య పుష్కరాలు'



పవిత్ర సంగమ ఘాట్ వద్ద వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి తొలి పుష్కర స్నానాన్ని ఆచరించి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పవిత్ర స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్కరాలు ప్రారంభం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు త్రివేణి సంగమ తీరానికి భారీగా చేరుకున్నారు. "హర హర మహాదేవ", "జై సరస్వతి మాత" నినాదాలతో పుష్కర ఘాట్లు మార్మోగిపోయాయి. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఘాట్ల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఘాట్ల వద్ద చలువ పందిళ్ల ఏర్పాటు చేయడంతో పాటు మిస్ట్ ఫ్యాన్లు, నీటి జల్లుల ఏర్పాట్లు చేశారు. తాగునీరు, పారిశుద్ధ్యం, మొబైల్ టాయిలెట్లు, విశ్రాంతి కేంద్రాలు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచారు. రవాణా సౌకర్యాల కోసం ప్రత్యేక బస్సులను నడుపుతూ భక్తుల రాకపోకలను సులభతరం చేశారు. పుష్కరాల సందర్భంగా భక్తుల రద్దీని నియంత్రించేందుకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 2,500 మంది పోలీసు సిబ్బందిని విధుల్లో నియమించి ఘాట్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక మార్గదర్శకాలు అమలు చేస్తున్నారు. 12 రోజుల పాటు నిర్వహించనున్న సరస్వతీ నది అంత్య పుష్కరాలకు రాబోయే రోజుల్లో మరింత భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. భక్తులు అధికారుల సూచనలు పాటిస్తూ ప్రశాంతంగా పుష్కర స్నానాలు ఆచరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అగ్ని గుండంలా..'అంత్య పుష్కరాలు'

- 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- భక్తుల భద్రతలో నిమగ్నమైన సిబ్బందికి తీవ్ర ఎండ ఇబ్బందులు
- మండిపోతున్న ఎండల మధ్య కొనసాగుతున్న పుష్కర సేవలు

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలు మండుతున్న ఎండల మధ్య కొనసాగుతున్నాయి. ఉదయం నుంచే భక్తులతో కళకళలాడుతున్న పుష్కర ఘాట్‌లు మధ్యాహ్నానికి అగ్ని గుండంలా మారుతున్నాయి. జిల్లాలో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటడంతో భక్తులు, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పుష్కర స్నానాల కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు కాళేశ్వరానికి తరలివస్తున్నారు. మండే ఎండలను లెక్కచేయకుండా పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు తాగునీరు, నీడ కోసం ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఎండ వేడికి



అలసటకు గురవుతున్నారు. భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ఘాట్‌ల వద్ద పర్యవేక్షణ కోసం పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖల సిబ్బంది నిరంతరం విధుల్లో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలోనే విధులు నిర్వర్తించాల్సి రావడంతో సిబ్బంది తీవ్ర అలసటకు గురవుతున్నారు. కొందరు పోలీసులు, సిబ్బంది నీరసం కారణంగా విశ్రాంతి తీసుకుంటున్న పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు పుష్కర ఘాట్‌ల వద్ద తాగునీటి సదుపాయాలు, చలివేంద్రాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఎండదెబ్బకు గురికాకుండా భక్తులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. తలకు గుడ్డలు కట్టుకోవడం, తరచూ నీరు తాగడం, చిన్నారులను ఎండలో ఎక్కువసేపు ఉంచకపోవడం మంచిదని సూచిస్తున్నారు.

# మర్రిగూడ నూతన ఎస్ఐగా రాంబాబు బాధ్యతలు

**అవినీతి ఆరోపణలతో విఆర్ కు అటాచ్ అయిన ఎస్ఐ కృష్ణారెడ్డి**

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మర్రిగూడ పోలీస్ స్టేషన్ కు నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా బి.రాంబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై ఆయన మర్రిగూడ వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్ఐ కృష్ణారెడ్డిపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో, ఉన్నతాధికారులు ఆయనను నల్లగొండ హెడ్ ఆఫీస్ కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నూతన ఎస్ఐగా రాంబాబు బాధ్యతలు చేపట్టి మాట్లాడారు.. బాధితులకు అండగా ఉంటామని, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు మొదటి




ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు దళారులను నమ్మకుండా, నేరుగా వచ్చి తమకు ఫిర్యాదు చేయవచ్చని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూస్తామని ఆయన అన్నారు.



# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన

**14 వ,వార్డ్ కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్**

చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 14వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గురువారం 14 వ వార్డు కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్ విద్యార్థి దిగా పాల్గొని వారి చేతుల మీదుగా నూతన ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తన నియోజకవర్గంలోని ప్రజలందరూ సంతోషంగా ఉండాలనే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్క లబ్ధిదారుడు సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని 14వ వార్డ్ కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సంద గళ్ళ విజయ సతీష్ గౌడ్, గృహ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# దేవరకొండ పురపాలక ప్రజలకు కోతుల బెడద నుండి ఉపశమనం

**నెల్లూరు నుండి కోతులు పట్టే వాళ్లను పిలిపించి పట్టాము...**

**దేవరకొండ మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు...**

**దేవరకొండ టౌన్ మే 21 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** దేవరకొండ పురపాలక సంఘం ప్రజలను కోతుల బెడద నుండి కాపాడుటకు నెల్లూరు నుండి కోతులను పట్టే వాళ్ళని పిలిపించి కోతులను పట్టించడం జరిగింది అని మునిసిపల్ చైర్మన్ శ్రీమతి పున్న శైలజ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గత కొద్ది సంవత్సరాలుగా దేవరకొండలో పట్టణంలో కోతుల నుండి పట్టణ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వాటి నుండి కొంత ఉపశమనం కలిగించడానికి మున్సిపాలిటీ సారిటరీ ఇన్స్పెక్టర్ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో కోతులను పట్టించామని తెలియజేశారు. పట్టించిన కోతులను శ్రీశైలం ఫారెస్ట్ అడవులలో వదిలి పెట్టడం జరుగుతుందని తెలిపారు. వీరి వెంట మునిసిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్ గౌడ్, జవాన్లు రాజేష్, శరత్ లు ఉన్నారు...



# వార్త రాస్తే.. నోరేస్తారా?

- **విలేకరిపై కౌన్సిలర్ భర్త దుర్భాషలు**
- **రెండు నెలలైనా సీసీ రోడ్డు ఇరువైపులా వేయని మట్టి**
- **'క్రైమ్ మిర్రర్' కథనంతో బట్టబయలైన వాస్తవాలు**
- **ప్రజాప్రతినిధుల తీరుపై మండిపడుతున్న అమరవాది గ్రామస్తులు**

**రామకృష్ణాపూర్, మే 21 (క్రైమ్ మిర్రర్):** ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచే విలేకరులపై పాలకపక్ష నాయకులు దుర్భాషలాడడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అమరవాది గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు ఇరువైపులా మట్టి పోయకపోవడంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై 'క్రైమ్ మిర్రర్' దినపత్రికలో ప్రచురితమైన "కాంట్రాక్టర్ల అరకొర పనితనం.. అధికారుల ఉదాసీనత!", "రోడ్డు వేశారు.. మట్టిని మరిచారు!", "పట్టించుకోని అధికారులు, కౌన్సిలర్" అనే కథనాలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి.

**బెదిరింపులకు దిగిన కౌన్సిలర్ భర్త!**

అమరవాదిలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తై రెండు నెలలు గడుస్తున్నా, రోడ్డు ఇరువైపులా మట్టిని నింపే పనులను కాంట్రాక్టర్, అధికారులు పూర్తిగా విస్మరించారని, దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు పక్కకు తప్పుకునే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు 'క్రైమ్ మిర్రర్' విలేకరి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యపై విలేకరి బుధవారం కథనాన్ని ప్రచురించారు.అయితే ఈ వార్తపై ఆగ్రహం వ్యక్తం చేసిన 5వ వార్డు కౌన్సిలర్ భర్త దాముఖ రమేష్, పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద నిర్వహించిన రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకుల సమక్షంలో విలేకరిని అడ్డుకుని ఆగ్రహం వ్యక్తం చేశాడు. "మా వార్డుపై వార్త ఎట్లా రాస్తావు?" అంటూ దూషిస్తూ బెదిరింపులకు దిగాడు.

**నిజాలు నిగ్గుతేల్చిన విలేకరులు..**

విలేకరిపై దుర్భాషలాడిన విషయం తెలుసుకున్న స్థానిక విలేకరుల బృందం గురువారం అమరవాది గ్రామాన్ని సందర్శించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి



గ్రామస్తులను వివరణ కోరగా,పత్రికలో వచ్చిన కథనం అక్షర సత్యమని వారు స్పష్టం చేశారు.సీసీ రోడ్డు నిర్మాణం పూర్తై రెండు నెలలు గడుస్తున్నా అధికారులు, కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని తెలిపారు. దీంతో రోడ్డు ఎత్తుగా మారి ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇచ్చే సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**సొంత డబ్బులతో కంకర పోయించుకున్నాం..**

"రోడ్డు ఇరువైపులా మట్టి వేయాలని పలుమార్లు కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో మా ఇళ్ల ముందు సొంత డబ్బులు వెచ్చించి కంకర పోయించుకున్నాం. ప్రజల ఇబ్బందులను పత్రికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లే విలేకరులను బెదిరించడం ఎంతమాత్రం సరికాదు" అని గ్రామస్తులు పేర్కొన్నారు.

**వర్షాకాలం ముందే స్పందించాలి..**

త్వరలో విద్యాసంస్థలు ప్రారంభం కానుండటంతో స్కూల్ బస్సులు, ఆటోలు తిరిగితే ప్రమాదాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు వర్షాకాలం సమీపిస్తుండటంతో రోడ్డు ఇరువైపులా ఉన్న గుంతలు మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గం స్పందించి తక్షణమే సీసీ రోడ్డు ఇరువైపులా మట్టి నింపి సమస్యను పరిష్కరించాలని అమరవాది గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.


# హత్నూరలో ధాన్యం కొనుగోళ్ల నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్

**డీసీఓ, ఎంపీడీఓ, ఏపీఎం లకు షోకాజ్ నోటీసులు**

**రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక**

**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 21:** హత్నూర మండలంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం, సమన్వయ లోపాలు, పర్యవేక్షణ వైఫల్యాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులపై చర్యలకు ఉపక్రమించారు. ఈ మేరకు జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, హత్నూర ఎంపీడీఓ బి. శంకర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజశేఖర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హత్నూర మండలంలో ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు సంతృప్తికరంగా సాగడం లేదని, కొనుగోలు కేంద్రాల వద్ద పర్యవేక్షణ, మానిటరింగ్, శాఖల మధ్య సమన్వయంలో తీవ్ర లోపాలు ఉన్నట్లు గుర్తించామని కలెక్టర్ తెలిపారు. ఈ అంశంపై పలుమార్లు ఆదేశాలు ఇచ్చినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఫీల్డ్ స్థాయిలో సమర్థవంతమైన పర్యవేక్షణ లేకపోవడం, కొనుగోలు ప్రక్రియలో జాప్యాలు, సంబంధిత శాఖలుఏజెన్సీల మధ్య సమన్వయ లోపం కారణంగా కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని వెల్లడించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు సకాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యానికి ఎలాంటి అవకాశం లేదని స్పష్టం చేసిన కలెక్టర్, షోకాజ్ నోటీసులు అందుకున్న అధికారులు మూడు రోజులలోపు తమ వివరణ సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.





# అద్దంలా దారులు అందని ఆర్టీసీ సేవలు..!

**ప్రజలకు అందని ద్రాక్షలా షాద్ నగర్ ఆర్టీసీ.**

**కడ్తాల్ షాద్ నగర్ ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలి.**

**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** ప్రస్తుతం గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి పేరుతో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. అనేక గ్రామాల మధ్య అద్దంలా మెరిసే బ్లాక్‌టాప్ రహదారులు ఏర్పడ్డాయి. ప్రయాణానికి అనుకూలమైన ఈ రహదారులు ప్రజలకు ఎంతో సౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. అయితే ఈ అద్భుతమైన రహదారులపై ప్రజలకు అత్యవసరమైన ఆర్టీసీ బస్సు సేవలు మాత్రం అందకపోవడం బాధాకరం.కేశంపేట మండల పరిధి నుంచి కొత్తపేట,షాద్ నగర్, కడ్తాల్ మార్గంలో ఎలాంటి ఆర్టీసీ సేవలు లేకపోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గంలో బుచ్చిగూడ, వెలిజర్ల, సంగేం, ఏక్లాస్ ఖాన్ పేట, అల్వాల్, కొత్తపేట, సంతాపూర్, రావిచెడ్, న్యామతాపూర్, మాదారం, టాకరాజు గూడ, 13 గ్రామపంచాయతీ ఉన్నాయి. అటు షాద్ నగర్ నుంచి కడ్తాల్ కు నిత్యం రాకపోకలు జరుగుతూ ఉంటాయి. ఆయా గ్రామాల్లో విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వృద్ధులు ఎక్కువగా ప్రభుత్వ రవాణాపైనే ఆధారపడుతుంటారు. మంచి రహదారి ఉన్నప్పటికీ బస్సులు రాకపోవడంతో ప్రజలు ఆటోలు, ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. దీనివల్ల ప్రయాణ ఖర్చులు పెరిగి సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ప్రత్యేకంగా విద్యార్థుల పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. కాలేజీలు,పాఠశాలలకు వెళ్లేందుకు సరైన సమయానికి బస్సులు లేకపోవడంతో వారు ఆలస్యంగా చేరుకోవడం లేదా చదువును మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రజలకు అందని ద్రాక్షలా షాద్ నగర్ ఆర్టీసీ సేవలు.. ఈ మార్గంలో కొత్తపేట గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏక్లాస్ ఖాన్ పెట



ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రావిచెడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల,కడ్తాల లో కాలేజీలు ఉన్నాయి. ఇక్కడి నుంచి విద్యార్థులు వెళ్లాలంటే ఆర్టీసీ బస్సులు లేక తీరా ఇబ్బందికి గురై ప్రజలకు అందని ద్రాక్ష పండులా షాద్ నగర్ ఆర్టీసీ అని చెప్పవచ్చు.గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలను రైతులు హైదరాబాద్ కు వెళ్లాలంటే దూరప్రాంతంగా ఉంటుంది.అదే షాద్ నగర్ ప్రాంతం చాలా అనువైన ప్రాంతం కాని రవాణా సౌకర్యం లేకపోవడం తో అక్కడికి తీసుకువెళ్లి అమ్ముకోవడానికి చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.సరైన రవాణా లేక అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లేందుకు కూడా ప్రజలు తీవ్ర కష్టాలు అనుభవిస్తున్నారు.ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో సేవలను తగ్గిస్తున్నారని చెబుతున్నారు. కానీ బస్సులు సరైన సమయానికి, క్రమం తప్పకుండా నడిస్తే ప్రయాణికుల సంఖ్య స్వయంగా పెరుగుతుందని గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సదుపాయాలు మెరుగుపడితే విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కూడా అభివృద్ధి చెందుతాయని ప్రజలు వాపోతున్నారు.ప్రభుత్వం రహదారుల నిర్మాణంతో పాటు ప్రజలకు అవసరమైన ఆర్టీసీ సేవలపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని బాధ్యత అధికారులకు ఉందని అద్దంలా మెరిసే రహదారులు మాత్రమే కాదు, వాటిపై ప్రజలకు అందుబాటులో ఉండే రవాణా సేవలే నిజమైన అభివృద్ధికి సూచికల ని ఈ సందర్భంగా చర్చించుకుంటున్నారు.

# మండుతున్న ఎండలు... ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మండల వైద్యాధికారి సిహెచ్ కాటంరాజు**



**చౌటుప్పల్, మే 21, క్రైమ్ మిర్రర్:** రాష్ట్రంలో ఎండలు వడగాలుపులు తీవ్రత విపరీతంగా ఉన్నందువల్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి సిహెచ్ కాటంరాజు తెలిపారు. మొదటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల నుండి 45 డిగ్రీలకు పైగా నమోదు అవుతున్నాయి. ముఖ్యంగా మధ్యాహ్నం 11 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఇల్ల నుంచి బయటకు రావద్దని వైద్య నిపుణులు డాక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు,బహిరంగ ప్రదేశాల్లో పని చేసే కార్మికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలు తరచూ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, పండ్ల రసాలు వంటి ద్రవపదార్థాలు, పుచ్చ పండ్లు, తాటి ముంజలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయట తిరగకుండా ఉండాలని, బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు గొడుగు, టోపీ లేదా తల కప్పుకునే వస్త్రాలను ఉపయోగించాలని తెలిపారు. తేలికపాటి,తెలుపు లేదా లేత రంగు వదులైన పత్తి దుస్తులు ధరించడం మంచిదని సూచించారు. ఎండలో ఎక్కువసేపు పనిచేయడం, మద్యం, కాఫీ, టీ వంటి పానీయాలు అధికంగా తీసుకోవడం, నూనె ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు, ఫ్రై చేసినవి తీసుకోవడం మంచిది కాదు అని చెప్పారు. మందంగా ఉండే బట్టలు, నలుపు రంగు దుస్తులు ధరించవద్దని సూచించారు. పిల్లలను లేదా వృద్ధులను వాహనాలలో ఒంటరిగా వదిలివేయకూడదని/ ఆరు బయట ఎండలో ఆడుకొనివ్వ రాదని హెచ్చరించారు. వడదెబ్బ లక్షణాలుగా అధిక జ్వరం, తలనొప్పి, తల తిరగడం, వాంతులు, అలసట, చెమట ఆగిపోవడం వంటి సమస్యలు కనిపించవచ్చని తెలిపారు. ఇటువంటి లక్షణాలు గమనించిన వెంటనే బాధితుడిని చల్లని ప్రదేశానికి తరలించి, శరీరంపై చల్లని నీరు పోయడం, ఓఆర్ఎస్ లేదా నీరు ఇవ్వడం చేయాలని సూచించారు. పరిస్థితి తీవ్రమైతే సమీప ఆరోగ్య కేంద్రానికి లేదా ఆసుపత్రికి వెంటనే తరలించాలని తెలిపారు. ప్రజలు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని, మండల పరిధిలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలలో, గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఓ ఆర్ ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉన్నాయని,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తంగడపల్లి వైద్య అధికారులు డాక్టర్. చింతకింది కాటం రాజు సూచించారు.

# ఇస్నాపూర్ లో గుర్తుతెలియని మగ వ్యక్తి శవం లభ్యం

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 21:** పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్ ఎక్స్ రోడ్ వద్ద గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో గుర్తుతెలియని మగ వ్యక్తి శవం లభ్యమైంది. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతుడు నలుపు రంగు టీ-షర్ట్, బూడిద రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఎత్తు సుమారు 5 అడుగులు 2 అంగుళాలు, చామనచాయ వర్ణం కలిగి ఉన్నట్లు గుర్తించారు. శవాన్ని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రి, పటాన్‌చెరు మార్చురీలో భద్రపరిచారు. మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే కింది నంబర్లను సంప్రదించాలని పోలీసులు కోరారు. సంప్రదించవలసిన నంబర్లు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ 8712661839, ఎస్ఐ, పటాన్‌చెరు 8712583468



# వేసవి సెలవుల్లో ఊరికి వెళ్తున్నారా జరభద్రం: జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 21:** వేసవి సెలవుల నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో చాలామంది సొంత ఊర్లకు, ఇతర ప్రాంతాలకు వెళు తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. ఖాళీ ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇంట్లో బంగారం, విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరచడం, పక్కింటి వారికి సమాచారం ఇవ్వడం, వాహనాలకు అదనపు లాకులు వేయడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8712656739 కు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే సుదూర ప్రాంతాలకు వెళ్తున్న వారు తమ ప్రయాణ వివరాలను సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తే గస్తీ పెంచే చర్యలు చేపడతామని తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించడమే లక్ష్యం

**గ్రామ అభివృద్ధిలో ఉపాధి హామీ పనులు కీలకం**

**ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచ్, ఉప సర్పంచ్**

**కొంపల్లిలో క్షేత్ర స్థాయిలో పరిశీలన**

**కూలీలు జాగ్రత చర్యలు తీసుకోవాలి**

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండల పరిధిలోని కొంపల్లి గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను గ్రామ సర్పంచ్ జీడిమడ్ల నిర్మల దశరథ ఉప సర్పంచ్ వెదిరే విజేందర్ రెడ్డి పెద్ద చెరువులో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వారు కూలీలు చేస్తున్న పనులను దగ్గరుండి చూసి, పనుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ఉపాధి హామీ పనులు ఎంతో కీలకం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడమే మా లక్ష్యం. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా అధికారులు, మేట్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.అని సూచించారు.ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున .కూలీలు కూడా ఉదయాన్నే వచ్చి పనులను త్వరగా పూర్తి చేసుకోవాలి. అని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వామి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ స్వరూప,జీడిమడ్ల దశరథ, సంకు శంకర్,సుక్క శంకర్ ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు..





## పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి ఘన నివాళులు

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలతో ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నరసింహ రెడ్డి, సిద్ధలా దశరథ్, మాజీ కార్పొరేటర్ సిద్ధల శ్రీశైలం, మాజీ టెంపుల్ డైరెక్టర్ వెంకటేశ్వర్ గౌడ్, విజేందర్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రోహిత్ రెడ్డి, సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు గంగమ్మ, రంగారెడ్డి జిల్లా మహిళ కాంగ్రెస్ మాజీ వైస్ ప్రెసిడెంట్ అరుణ దేవి, మీర్పేట్ మాజీ మహిళ అధ్యక్షురాలు పద్మశ్రీ, మీర్పేట సోషల్ మీడియా సిదేశ్వర్ చారి, ఆలే శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, మురళి గౌడ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ పరశురాం, సైదులు, ఓం ప్రకాష్, అలా శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, రాజేందర్ కమల్ నెహ్రూ తదితరులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.


## ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం



**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** వలిగొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఆర్‌డీఓ నాగిరెడ్డి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జలంధర్ రెడ్డి అధ్యక్షతవహించారు. సమావేశంలో కార్మికుల మొబిలైజేషన్, సోక్‌పిట్స్ నిర్మాణం, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్షనిర్వహించారు. ప్రతి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పనుల స్థితిగతులను పరిశీలిస్తామని, విధుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సీబీఎస్ వెరిఫికేషన్‌ను ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పెన్షన్లు పొందుతూ మరణించిన లబ్ధిదారుల వివరాలను వెంటనే గుర్తించి,వారి పెన్షన్లను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి అందిన సమాచారం ప్రకారం వివిధ వర్గాలకుసంబంధించిన కొత్త పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. అందువల్ల గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వర్గాల వారీగా జాబితాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. అదేవిధంగా ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను సమావేశంలో వివరించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకం ప్రయోజనాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి వై. ప్రేమలత,ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ రమ్యశ్రీ,ఏపీఓ పరశు రాములు ఈసీ విక్రమ్ జూనియర్ అసిస్టెంట్ ఎం.డిసమీయుద్దీన్, ఏఈ హౌసింగ్ కిరణ్ అశోక్, హౌసింగ్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు,గ్రామ పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ ఓటర్ల గుండెల్లో రైళ్లు: 'సార్' దెబ్బకు రెండు వోట్ల దందాకు బ్రేక్!

- మూడవ విడత ప్రత్యేక సమగ్ర సవరణతో రంగంలోకి ఈసీ
- క్షేత్రస్థాయిలో నిఘా తరహా సర్వే!




**కుత్బుల్లాపూర్, మే 21 (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ వ్యాప్తంగా సరిహద్దు మరియు ఇతర రాష్ట్రాల ఓటర్ల వ్యవహారంలో ఒక పెద్ద కుదుపు మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా, కఠినంగా అమలు చేయబోతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ మూడవ విడత ప్రక్రియలో భాగంగా ఇప్పుడు రెండు చోట్లా ఓట్లు పెట్టుకుని చెలామణి అవుతున్న అక్రమార్కుల గుండెల్లో గుబులు రేపుతోంది. ఈ ప్రత్యేక సమగ్ర సవరణ అస్త్రం గనుక పూర్తిస్థాయిలో ప్రయోగిస్తే.. ఇక్కడ నివాసం ఉంటూ, ఇక్కడి ప్రభుత్వ ఫలాలను పొందుతూనే, పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాల్లో సమాంతరంగా ఓటు హక్కును అడ్డం పెట్టుకుని రాజకీయాలను శాసిస్తున్న వారి గుట్టు రట్టు కావడం ఖాయంగా కనిపిస్తోంది. దేశంలో ఒక వ్యక్తికి ఒకే చోట ఓటు హక్కు ఉండాలనే కఠినమైన చట్టపరమైన నిబంధనను ఈసారి పక్కాగా అమలు చేసేందుకు యంత్రాంగం పదునైన వ్యూహాన్ని సిద్ధం చేసింది.

### డూప్లికేట్ నెట్‌వర్క్‌పై బూత్ లెవెల్ 'సర్జికల్ స్ట్రైక్'

భాగ్యనగరంతో పాటు చుట్టుపక్కల ఉన్న ప్రధాన ఇండస్ట్రియల్ హబ్‌లలో నివసిస్తూ, పాత రాష్ట్రాల్లో రాజకీయ ప్రయోజనాల కోసం ఓట్లు అట్టే పెట్టుకున్న వ్యక్తుల సంఖ్య లక్షల్లోనే ఉన్నట్లు నిఘా వర్గాల అంతర్గత అంచనా. ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా ఇటువంటి బోగస్, డూప్లికేట్ ఓట్ల నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పాతరేయడానికి ఈసీ సమయం ఆసన్నం చేసింది. ఈసారి సాధారణ పరిశీలన కాకుండా, బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటి తలుపు తట్టి, నివాస ధృవీకరణ పత్రాలు మరియు పక్కా డాక్యుమెంట్ల ఆధారంగా థర్డ్ పార్టీ వెరిఫికేషన్ తరహాలో క్షుణ్ణంగా తనిఖీ చేసి రిపోర్ట్ సబ్మిట్ చేయనున్నారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా అక్కడికక్కడే ఓటుపై వేటు పడటం ఖాయంగా కనిపిస్తోంది.


### ఆ మూడు నియోజకవర్గాల పొలిటికల్ మాఫియాలో వణుకు!


ఈ ఆపరేషన్ ఊపందుకుంటే తెలంగాణలోని ప్రధాన నియోజకవర్గాల్లో ఇప్పటివరకు నడుస్తున్న పాత రాజకీయ సమీకరణాలు తలకిందులు కావడం ఖాయం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల మూలాలు కలిగిన ఓటర్లు అత్యంత భారీ సంఖ్యలో కేంద్రీకృతమై, ఎన్నికల ఫలితాలను తారుమారు చేయగల సత్తా ఉన్న భాగ్యనగర సరిహద్దు నియోజకవర్గాలైన కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి పరిధిలోని రాజకీయ లీడర్లలో ఈ పరిణామం తీవ్ర కలకలం రేపుతోంది. తమ ఓటు బ్యాంకు ఎక్కడ గల్లంతవుతుందోననే భయం ఇప్పుడు స్థానిక రాజకీయ శక్తులను వెంటాడుతోంది. ఎన్నికల అత్యున్నత వర్గాల సమాచారం ప్రకారం.. ఈసారి ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని, ప్రతి ప్రక్రియ పారదర్శకంగా, డాక్యుమెంట్ ఆధారితంగానే సాగుతుందని స్పష్టం చేస్తున్నారు. అర్హులైన నిజమైన పౌరుల హక్కులను కాపాడుతూనే, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే దొంగ ఓట్లను ఏరిపారేయడమే ఈ 'సార్' ఆపరేషన్ వెనుక ఉన్న అసలు రహస్యమని విశ్వసనీయ సమాచారం.

# మర్రిగూడ రిసార్ట్, గెస్ట్ హౌస్ లతో ఇల్లీగల్ పనులు..!

- నేరస్థులకు, అక్రమ సంబంధాలకు ఇవే అడ్డాలు..!?
- రిచ్ ఫీలింగ్ తో యువత ఆగం.. విలేజ్ లుక్ అంటూ బుకింగ్స్..
- విదేశీ మందులు..మంచింగ్ కు మగువలు..!?
- అర్ధరాత్రుళ్ళు చిల్ అవుతూ.. ఆకృత్యాలకు నిలువుటద్దం..!
- గంజాయి, హుక్కా, మత్తు పదార్థాలకు కేరాఫ్ గా ఈ ప్రైవేట్ ప్లేస్‌లు..


**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** ప్రకృతి ఒడిలో ప్రశాంతత, పచ్చని చెట్ల మధ్య సేదతీరేందుకు వీకెండ్ స్పాట్స్, విలేజ్ లుక్ అంటూ సోషల్ మీడియాలో సాగుతున్న, ఆకర్షణీయమైన ప్రకటనల వెనుక మర్రిగూడ పరిసర ప్రాంతాల్లో దందా నడుస్తోంది.! ఇక్కడి రిసార్టులు, ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లు ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు, నేరస్థులకు సురక్షితమైన అడ్డాలుగా మారుతున్నాయి. రిచ్ లైఫ్, చిల్ అవుట్ సంస్కృతి పేరుతో, యువత ఇక్కడ జీవితాలను ఆగం చేసుకుంటుంటే, కొందరు కేటుగాళ్లు మాత్రం కాసుల కక్కుర్తితో చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు. నగర కోలాహలానికి దూరంగా పల్లెటూరి వాతావరణాన్ని ఆస్వాదించాలనుకునే, వారిని టార్గెట్ చేస్తూ సాగుతున్న ఈ బుకింగ్స్ వెనుక అసలు కథ వేరే ఉందని స్థానికులు అంటున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇక్కడ మొదలయ్యే పార్టీలు సంస్కృతిని పాతర వేస్తుండగా, గంజాయి, హుక్కా, నిషేధిత డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు ఈ ప్రైవేట్ ప్లేస్‌లు కేరాఫ్ అడ్రస్‌గా మారాయని పుకారు..!?విదేశీ బ్రాండ్ల మద్యం, మంచింగ్ పేరుతో మగువలను ఏర్పాటు చేయడం వంటివి, ఇక్కడి క్లయింట్లను ఆకర్షించేందుకు నిర్వాహకులు వేస్తున్న ఎరలుగా ప్రచారం..!? ఈ మాయలో పడి ఎంతోమంది యువతీ యువకులు, తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. పట్టణాలకు దూరంగా కట్టిన, ఈ రిసార్టులు ఇప్పుడు నేరగాళ్లకు వరంగా మారాయి.! వివిధ కేసుల్లో నిందితులుగా ఉండి, పోలీసుల నుంచి తప్పించుకుని పారిపోతున్న పాతనేరస్థులకు, పేకాట బ్యాచ్ లకు ఇవి సురక్షిత నివాసాలుగా మారుతున్నాయని ఆరోపణలు వినపడుతున్నాయి..!? దీనికి తోడు అక్రమ సంబంధాలకు, వ్యభిచార నిర్వాహకులకు ఇవి ప్రధాన కేంద్రాలుగా మారాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి..!? అధికారులు స్పందించి అనుమతులు లేని రిసార్టులపై, తక్షణమే విచారణ నిర్వహించాలని, ప్రతి గెస్ట్ హౌస్‌లో కస్టమర్ల వివరాలను తప్పనిసరి చేస్తూ, మత్తు పదార్థాల సరఫరాను అరికట్టేందుకు స్పెషల్ రైడ్స్ జరపాలని స్థానికులు కోరుతున్నారు. రంగుల ప్రపంచం వెనుక దాగున్న ఈ అక్రమ సామ్రాజ్యాన్ని, కూకటివేళ్లతో పెకిలించకపోతే, మర్రిగూడ ప్రాంతం నేరాలకు కేపిటల్‌గా మారే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.




చట్టానికి కళ్ళు కప్పి యువత భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్న అక్రమ అడ్డాలు

# ఆధునిక భారత శిల్పి రాజీవ్ గాంధీ..!




- టెలికాం, కంప్యూటర్ రంగాల విప్లవ పితామహుడు..!
- నవోదయ విద్యాలయాల స్థాపకుడు రాజీవ్ గాంధీ..!
- ఆయన వేసిన పునాదులపైనే నేటి నవభారతం: నీలం మధు ముదిరాజ్..!
- ఇస్నాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి
- ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించిన నీలం..! వృద్ధులకు పండ్ల పంపిణీ..!

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 21:** భారతదేశాన్ని ఆధునిక ప్రపంచం వైపు నడిపించిన మహోన్నత దార్శనికుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ కొనియాడారు. గురువారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఏర్పాటు చేసిన స్మారక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న 19841989 కాలం దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదని, ఆయన తీసుకువచ్చిన విప్లవాత్మక చట్టాలు, దూరదృష్టితో కూడిన విధానాలే నేటి నవభారత ప్రగతికి బలమైన పునాదులని స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాలకు చెక్ పెడుతూ 1985లో రాజీవ్ గాంధీ తెచ్చిన 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని, పారదర్శకతను కాపాడిందని తెలిపారు. అలాగే, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందనే నమ్మకంతో 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు కనీస వయస్సును 21 నుండి 18 సంవత్సరాలకు తగ్గించి, కోట్లాది మంది యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేసిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. విద్యారంగాన్ని ఆధునికీకరిస్తూ 1986 జాతీయ విద్యా విధానం ద్వారా గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు ఆయన 'నవోదయ విద్యాలయాలు' స్థాపించారని గుర్తుచేశారు. నేడు భారతదేశం ప్రపంచ ఐటీ, టెలికాం రంగాలలో సూపర్ పవర్‌గా ఎదగడానికి, పల్లెల్లో సైతం సాంకేతికత విస్తరించడానికి ఆనాడే రాజీవ్ గాంధీ వేసిన కంప్యూటర్ విప్లవ పునాదులే కారణమన్నారు. మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ, మహిళా రిజర్వేషన్ల ఆలోచనకు ఆయనే శ్రీకారం చుట్టారని, అదే తదనంతర 73, 74 రాజ్యాంగ సవరణలకు మార్గదర్శకమైందని వివరించారు. దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ శ్రేణులంతా కట్టుబడి పనిచేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పడమటి గోపాల్ రెడ్డి, సంగన్న గారి గోపాల్, మంజలి దస్తగిరి, అల్లం గారి నరసింహారెడ్డి, సంపత్ రెడ్డి, వెంకటేష్ నాయక్, నారాయణదాసు, మన్నే రాఘవేంద్ర, మణికంఠ, సందీప్ గౌడ్, లక్డారం మాజీ ఎంపిటిసి శ్రీనివాస్, ముత్తంగి అశోక్, వెంకటేష్, మురళి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల ఆకస్మిక తనిఖీ

- కూలీలతో ముచ్చటించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**నూతనకల్ క్రైమ్ మిర్రర్:** ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి, ఆదాయ భద్రతను కల్పిస్తుందని, గ్రామీణ ప్రాంత కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరై ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు ప్రభుత్వం నిర్దేశించిన సాంకేతిక, నాణ్యత ప్రమాణాల ప్రకారం జరుగుతున్నాయా లేదా అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం నూతనకల్ మండల కేంద్రంలోని శంభుని చెరువు పూడిక తీత పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో పనిస్థలాల్లో కూలీలకు కల్పిస్తున్న ప్రాథమిక సౌకర్యాలపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఎండ నుండి ఉపశమనం కోసం ఏర్పాటు చేసిన షెడ్, తాగునీరు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు సిద్ధంగా ఉంచిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆయన తనిఖీ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయమే పనులు ముగించుకునేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆదేశించారు. కలెక్టర్ సాదాసీదాగా, స్నేహపూర్వకంగా కూలీల వద్దకు వెళ్లి వారితో ముచ్చటించారు. వేతనాలు సమయానికి జమవుతున్నాయా? ప్రభుత్వం ప్రకటించిన సగటు వేతనం అందుతుందా? పనుల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. కూలీలు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించగా, ఆయన వాటిని విని, తక్షణ పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తమతో అంతలా కలిసిపోవడంతో కూలీలు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో వడదెబ్బ తగిలిన వారికి తక్షణ వైద్యం అందించేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి, వైద్యుల సలహాలు పాటించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిఆర్డిఓ సన్యాసయ అడిషనల్ పిడి చంద్రశేఖర్, ఎంపీడీవో సునీత, ఏపీఓ పవన్ కుమార్,ఏపిఓ శ్రీరాములు , ఫీల్డ్ అసిస్టెంట్ గుండాల లింగయ్య,స్థానిక సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్,ఉప సర్పంచ్ నాగం సరిత సుధీర్ రెడ్డి ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి

- దేప శ్యాంసుందర్ ముదిరాజ్

**చౌటుప్పల్,మే 21, క్రైమ్ మిర్రర్:** భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సుక్క రవీందర్ ఆదేశాల అనుసారం చౌటుప్పల్ మండలం దండు మల్కాపూర్ గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్ గురువారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ ప్రధానిగా రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.డీ.గౌస్ ఖాన్, వార్డు మెంబర్లు ఈడుదుల ఇంద్రసేన యాదవ్, పక్కీర్ వంశీధర్ రెడ్డి,ఉప్పరి అనిల్ కుమార్,అత్తపురం సంతోష్ అంజిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి పక్కీర్ ప్రభాకర్ రెడ్డి,ఆంధోళ్ మైసమ్మ, రామలింగేశ్వర స్వామి డైరెక్టర్లు జొన్నగంటి దాసు,మన్నె మహేందర్ రెడ్డి, బొంతల యువరాజ్, సిలువేరు శంకర్,ఎల్లంకి లింగచారి,దౌడి లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈడుదుల హరిప్రసాద్, మహ్మద్ గాలిబ్ ఖాన్, ఎం.డీ.బాబా,సిలువేరు బాలయ్య,ఈడుదుల జంగయ్య,చామట్ల ప్రభాకర్,ఈడుదుల కేశవ్ యాదవ్, ఈడుదుల పరమేష్ యాదవ్,ముదిగొండ మహేష్, చందుపట్ల సాయి నేత,మహంకాళి పృథ్వి,సందగళ్ల నవీన్ గౌడ్,షేక్ అహ్మత్, రహ్మత్ తదితరులు పాల్గొన్నారు.

## డబల్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ఆత్మకూరు(ఎం),మే21/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మెయిన్ రోడ్ నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతోపాటు 1 కోటి 72 లక్షల రూపాయలు,మరియు రెండో విడత 80 లక్షలు రూపాయలతో నిర్మిస్తున్న డబల్ రోడ్డు నిర్మాణ పనులను గురువారం రోజు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరిశీలించడం జరిగింది.రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్ నీ ఆదేశించడం జరిగింది.రోడ్డుకు ఇరువైపులా చదును చేసి వెంటనే మట్టి పోయాలన్నారు. గ్రామంలోనీ కాలనీలోకి వెళ్ళే రోడ్డు మూలమలుపు వద్ద కూడా సీసీ రోడ్డు కలిసేటట్లు సిసి వేయాలని ఆదేశించారు. వీరివెంటా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కందడి అనంతరెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సర్వేపల్లి సర్పంచ్ కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి,మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ముద్దసాని సిద్దయ్య గౌడ్, మాజీ సర్పంచ్ జన్నాయికోడే నగేష్, మాజీ ఉప సర్పంచ్ దొంతరబోయిన నవ్యభాస్కర్, పిఏసీఎస్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎన్ఎస్యూఐ నాయకులు, తదితరులు ఉన్నారు.






## రైతులు ఉచిత భూ సారా పరీక్షలను వినియోగించుకోవాలి : సర్పంచ్ రామలింగయ్య యాదవ్

**ఆత్మకూరు(ఎం),మే21/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పుల్లాయిగూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ రామలింగయ్య యాదవ్ సారథ్యంలో, మన గ్రోమోర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత భూ సారా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు పాల్గొని ఈ సేవలు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కోరమండల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ మన గ్రోమోర్ సెంటర్ ఏరియా మార్కెటింగ్ మేనేజర్ జానకయ్య మాట్లాడుతూ రైతులకు సరైన అవగాహన లేక అత్యధిక ఎరువులు వినియోగించడం వల్ల భూమిలో సారం తగ్గిపోయి పంటలను నష్టపోతున్నారు. కాబట్టి మట్టి పరీక్షలు చేసి సారాన్ని గుర్తించి వాటికి సంబంధిత మందులను సూచిస్తామని అన్నారు. గ్రామ సర్పంచ్ నర్రాముల రామలింగయ్య యాదవ్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని, మంచి రాబడి రావాలని సూచించారు. మేనేజర్ హరిబాబు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 60 మందికి పైగా రైతులు భూ సారా పరీక్షలు వినియోగించుకున్నారని అన్నారు. దాంతో పాటు రైతులకు అవగాహన కల్పించి తగిన సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసోసియేట్ నవీన్, రైతులు తడిసిన మల్లారెడ్డి, పిసరి సుధాకర్ రెడ్డి, తండా బిక్షం, బండారు లక్ష్మా రెడ్డి, కొప్పుల నర్సిరెడ్డి, మాద భూపాల్, బండారు మల్లారెడ్డి, బండారు రవీందర్ రెడ్డి, బండారు దేవదాస్ రెడ్డి, మాల్ శంకర్ రెడ్డి, ఆవుల వీరయ్య,తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత కోసం గ్రామస్తులు కృషి చేయాలి

- డీపీఓ శంకర్ నాయక్



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** గ్రామాల పరిశుభ్రత గ్రామ ప్రజలపై ఆధారపడి ఉంటుందని నల్లగొండ జిల్లా పంచాయతీ అధికారి శంకర్ నాయక్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాశీపల్లి గ్రామాన్ని గురువారం సందర్శించి పలు వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఇంటిని, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకుంటే గ్రామం పూర్తిగా పరిశుభ్రంగా మారుతుందని అన్నారు. తమ వీధులు, వార్డులు తద్వార గ్రామం మొత్తం పరిశుభ్రంగా ఉండటానికి ప్రజలు కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా దుకాణదారులు, హోటళ్లు, వీధి వ్యాపారులు తదితర వ్యాపార సంస్థలు చెత్త సేకరణ కు ప్రత్యేక కుండీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చెత్త సేకరణ లో గ్రామ పంచాయతీ సిబ్బందికి ఎల్లవేళలా సహకరించాలని శంకర్ నాయక్ అన్నారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ బత్తుల లక్ష్మీ ప్రసన్న నరసింహా గౌడ్, ఉప సర్పంచ్ ఆకుల కృష్ణ, వార్డు సభ్యులు రత్నం నాగరాజు, బొడిగ ప్రభాకర్, గోపగోని లింగస్వామి, కురుమర్తి లింగస్వామి, గ్రామ కార్యదర్శి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

# నూతన విబిజీ రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి

- మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తిరిగిపునరుద్ధరించాలి
- 200 రోజుల పని దినాలు కల్పిస్తూ రోజు కూలీ 600 రూపాయలకు పెంచాలి
- రెండుసార్లు ఫోటో తీసే విధానాన్ని రద్దుచేయాలి
- కొండమడుగు నరసింహతెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పిస్తూ రోజు కూలి 600 రూపాయలు పెంచాలని రెండుసార్లు ఫోటో తీసే విధానంను రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నరసింహ,జిల్లా ఉపాధ్యక్షులు సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు.గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సంగెం గ్రామంలో ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న పని ప్రదేశంలో జరిగిన కూలీల సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘాలు వామపక్ష పార్టీల పోరాట ఫలితంగా 2005 లో పార్లమెంట్లో చట్టం చేసి 2006 నుండి జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అమలులోకి వచ్చిందన్నారు,నేడు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చట్టాన్ని సక్రమంగా అమలు చేయకుండా బడ్జెట్ లో కేటాయించిన నిధులను దారి మళ్లిస్తూ క్రమక్రమంగా నిర్వీర్యం చేసే కుట్ర చేసిందని అందులో భాగంగానే ఇటీవల కాలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మారుస్తూ విబిజి రాంజీ చట్టాన్ని తీసుకొస్తుందన్నారు.ఈ నూతన చట్టంలో ఉపాధి హామీ కూలీలను క్రమంగా పనులకు దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాలని కుట్రపూరితమైన విధానాన్ని తీసుకొచ్చింది.ఈ విధానంతో రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం నిధులు చెల్లించని పక్షంలో కూలీలకు పనులు దొరికే పరిస్థితులు లేకుండా చేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు, మరోవైపు పని ప్రదేశంలో ఉదయం ఒకసారి,మరో నాలుగు గంటల తర్వాత రెండవ సారి ఫోటో తీసే విధానాన్ని తీసుకొచ్చి వ్యవసాయ కూలీలకు ఈ పని పట్ల అపహాస్యం కలిగించే విధంగా బిజెపి నేతృత్వంలో కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు.నూతన విబిజి రామ్ జి చట్టాన్ని ప్రభుత్వం వెంటనే రద్దుచేసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించాలని అదేవిధంగా బడ్జెట్ లో కేటాయింపులు సక్రమంగా విడుదల చేయాలని.సంవత్సరానికి 200 రోజులు పని దినాలను కల్పిస్తూ రోజు కూలీ 600 రూపాయలకు పెంచాలని,పనిముట్లు గడ్డపార,పార,తట్ట,గొడ్డలి లను కూలీలందరికీ ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12,000 రూపాయలు వెంటనే అమలు పరచాలని,కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విబిజీ రాంజీ చట్టాన్ని ఉపసంహరించుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల సహాయ కార్యదర్శులు,భీమనబోయిన జంగయ్య, మద్దెల శంకరయ్య, మండల నాయకులు జక్కల అంజయ్య, చేగురి నరసింహ, యాదమ్మ, సుగుణమ్మ మణెమ్మ, చంద్రయ్య, అనంత లక్ష్మీ, రాధమ్మ, ఎల్లమ్మ, బుచ్చమ్మ, కళమ్మ, అండాలు, లక్ష్మమ్మ, పద్మ, భారతమ్మ, సైదాబీ, మూర్తజా, షబానా, లతీఫ్, అనురాధ, మల్లమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# కిష్టారెడ్డిపేటలో జోరుగా అక్రమ నిర్మాణాలు..!

- చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి ప్రజల్లో ఆందోళన



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, మే 21:** అమీన్‌పూర్ పరిధిలోని కిష్టారెడ్డిపేట ప్రాంతం దుర్గానగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా భారీ భవన నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. అనుమతులు లేకుండానే పలుచోట్ల నిర్మాణ పనులు సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఐదు నుంచి ఆరు అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మాణాలు పూర్తి స్థాయి అనుమతులు లేకుండానే చేపడుతున్నారని, దీనివల్ల పరిసర భవనాల భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు కేవలం తనిఖీలు నిర్వహించి వెళ్లిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు, పన్నులు తప్పించుకునేందుకు కొంతమంది బిల్డర్లు అక్రమ మార్గాలు అనుసరిస్తున్నప్పటికీ చర్యలు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హెచ్ఎండీఏ, మున్సిపల్ అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, అదనపు పన్నులు తప్పించుకునేందుకు కొందరు బిల్డర్లు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి స్థానిక స్థాయిలో సహకారం ఉందనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాల కారణంగా ప్రభుత్వ ఖజానాకు ఆదాయ నష్టం కలుగుతోందని, భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు, డ్రైనేజీ ఇబ్బందులు, ప్రజా భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ జరిపి అక్రమ నిర్మాణాలపై, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

